# నీటిపోగు

వాసు నుండి ఎప్పుడయినా కబురు వస్తుందన్న విషయం నేను ఊహించంది కాదు. ఎప్పుడో రావలసింది, కాకపోతే... ఆలస్యం అయింది. వాసు నుండి కాకపోయినా సదానందం నుండయినా వచ్చి ఉండేది. వాళ్లిద్దరికీ నేసంటే నమ్మకం ఉంది.

మా పరిచయం ఇప్పటిది కాదు. వాళ్ళంటే మొదటినుండీ నాకు భయం లేదని కాదు. వాళ్ళ మూలాన నేనెక్కడ ఇబ్బందిపాలవుతానోనన్న భయం ఇప్పటికీ ఉంది. నిజానికి 'కష్టం' వాళ్ళిద్దరిదీ! నాకు ఎటువంటి సంబంధం లేదు. వాళ్ళు

పోలీసుల పాలయి ఉంటారనే అనుకున్నాను. ఎంతుందో నేనెప్పుడూ లెక్కపెట్టలేదు. కొన్ని కోట్ల రూపాయలు ఉన్న సంచీ, ఎన్నో బంగారు నగలున్న మరో పెట్టె... ఒకరోజు తెలతెలవారుతుండగా నాకు ఇచ్చి వెళ్ళిపోయారు.

వాటిని వాళ్ళు దొంగతనం చేశారో... లేక... వాళ్ళకు ఎవరయినా ఇచ్చి దాచమన్నారో నాకు తెలియదు. ఇస్తూ వాళ్ళు నాకు ఏమీ చెప్పలేదు. అడగడానికి అవకాశం ఇవ్వలేదు. ఎవరో తరుముకొస్తున్నట్టుగా వచ్చి నాకిచ్చి "జాగ్రత్తగా దాయి, ఏ పొరపాటయినా జరిగిందా... నీ గొంతు కోస్తాను" అన్నాడు సదానందం.

వాసు ఏ విషయాన్నీ సీరియస్‌గా తీసుకోడు. సదానందం మాత్రం నిక్కచ్చిగా మాట్లాడతాడు.

వాళ్ళు హడావుడిపడుతూ వెళ్ళిపోతుంటే "ఎప్పుడొచ్చి తీసుకువెళ్తారు?" అడిగాను.

"త్వరలో" అని చీకట్లో మాయమయ్యారు.

వాటిని భద్రంగా దాచాను అయిదారు నెలలపాటు. 'వాళ్ళు దొంగతనం చేసి తీసుకొచ్చి నా దగ్గరగానీ పెట్టారా?' అని భయపడ్డాను. పోలీసులను చూస్తే నాకు భయం వేసేది. ఎవరికో తప్ప.. వాసూవాళ్ళు నాకు దగ్గరని చాలామందికి తెలియదు. కాలేజీ వదిలాక అడపాదడపా కలుసుకోవడం మించి మా స్నేహం అంతగా కదలలేదు.

మరో మూడు నెలల తర్వాత, భయం తగ్గింది. సంచీ విప్పాను. లెక్కలేనంత డబ్బు కట్టలు కట్టి ఉంది! అందులో ఎంతుండి ఉంటుందో వాళ్ళకూ తెలిసి ఉంటుందనుకోను. ఆ సంచీని ఎత్తడానికి నా ఒక్కడి వల్లా వీలుకాలేదు. మూడు సంచుల్లో సర్దాను. ఆ పెట్టెనిండా బంగారపు నగలున్నాయి. వాటిని అటకమీద పెట్టాను.

సంవత్సరమయింది. రెండు, మూడు సంవత్సరాలయ్యాయి. వాళ్ళ జాడలేదు. సమాచారమూ లేదు. వాళ్ళ ఊళ్ళు నాకు తెలుసు కానీ వెళ్ళడానికి జంకాను.

మేం ముగ్గురం కలిసి మెడిసిన్ చదువుకున్నాం. వాళ్ళిద్దరికంటే నేనేమీ ఉన్నవాడిని కాదు. వాళ్ళిద్దరూ బాగా డబ్బున్నవాళ్ళు. అలా అని వాళ్ళనుంచి నేను

ఎప్పుడూ ఆశించలేదు. వాళ్ళు ఏ తేడా చూపించకుండా, నన్ను కలుపుకొనే వాళ్ళు.

వాసు కోపిష్టి. అయితే, కోపం వచ్చిన అయిదు నిమిషాలకు మామూలయిపోతాడు. సదానందం మాత్రం కోపం వచ్చినా సంతోషం వచ్చినా బయటపడిపోతుంటాడు.

నేను చదువులో ముందుండేవాడిని. ఎక్కడా ఆగకుండా మెడిసిన్ పూర్తి చేయగలిగాను. వాళ్ళు బ్యాక్‌లాగ్‌లు మిగుల్చుకుని, మెడిసిన్ పూర్తి చేయకుండా మిగిలిపోయారు. నాకూ చాలాకాలం వాళ్ళ గురించి తెలియలేదు. యం.ఎస్. పూర్తి చేసిన తర్వాత, సంవత్సరంపాటు ఒక కార్పొరేట్ ఆస్పత్రిలో పనిచేశాను. పేరున్న ఆస్పత్రే. కానీ ఎక్కువ జీతం ఇచ్చేవాళ్ళు కాదు. ఇబ్బంది పడేవాడిని. అదృష్టవశాత్తు ప్రభుత్వ ఆస్పత్రిలో ఉద్యోగం రాగానే, కార్పొరేట్ ఆస్పత్రి ఉద్యోగం మానేశాను. ఎనిమిది సంవత్సరాలపాటు ప్రభుత్వ పని చేశాను. అనుభవంతో పాటు మంచి పేరువచ్చాక, ఉద్యోగం మానేసి, సొంత నర్సింగ్‌హోం కట్టించాను. అది ఇప్పుడు ఏడు అంతస్తుల భవనం అయింది!

షో ఉండకపోతే రోగులు రారు, అడిగినంత ఇవ్వరు. నా ఆస్పత్రి అంత త్వరగా పేరు తెచ్చుకోడానికి ఒక కారణం... మెడికల్ కంపెనీలు. రెండోది... పెద్ద కారణం.. డబ్బులు! మూటల్లోంచి చాలా తీశాను. ఎంత తీశానో నాకే గుర్తులేదు. నేను తీసుకున్నాక కూడా ఎంతో ఉంది. అంతా వాడేయడం బావుండదని ఆగాను. అవన్నీ ఏడో అంతస్తులో ఉన్న నా గదిలో, ప్రత్యేకంగా కట్టించిన లాకరులో మూడో కంటికి తెలియకుండా దాచాను. ఇప్పుడు అవి లేకపోయినా నాకు ఎటువంటి ఇబ్బందీ లేదు. ఆస్పత్రి కామధేనువు లాటిది. కట్టడానికి పెట్టుబడి ఒక్కటే ఖర్చు. పేరు రావడం మొదలెట్టాక, రాబడికి కొదవ ఉండదు. పన్నుల బారినుండి తప్పించుకోవడానికి చాలా మార్గాలుంటాయి.

ఆ సాయంత్రం అయిదింటికి వాసు నుండి ఫోన్ వచ్చింది. అతని కంఠస్వరం బొంగురుగా ఉంటుంది. ఎన్ని సంవత్సరాలయినా గుర్తుపట్టగలను. నా సెల్ నెంబర్ కనుక్కోవడం అతనికేమీ కష్టమయి ఉండదు. ముందు తను పేరు చెప్పకుండా "నేను" అన్నాడు.

మాట మామూలుగా ఉన్నా, నా వెన్నులోంచి చలి మొదలయింది. "చెప్పు వాసూ! ఎలా ఉన్నావు? ఎక్కడినుండి మాట్లాడుతున్నావు?" అడిగాను.

నవ్వి "నా గొంతు గుర్తుపట్టవనుకున్నాను. మీ ఊరొచ్చి గంటవుతోంది. హొటల్లో దిగాను. మరో అరగంటలోనో గంటలోనో సదానందం వచ్చి నన్ను కలుస్తాడు. ఇద్దరం కలిసి రాత్రి పది దాటాక నిన్ను కలవడానికి వస్తున్నాం. ఎక్కడికి రమ్మంటావు? మీ నర్సింగ్‌హొమ్‌కా? ఇంటికా?" అడిగాడు.

"నర్సింగ్‌హొమ్‌కు వచ్చేయండి. ఏడో అంతస్తుకు సరాసరి రండి."

"మమ్మల్ని రమ్మని చెప్పి, వేరే ఏ పనీ పెట్టుకోవు కదా?"

"లేదు. మీ కోసమే ఎదురుచూస్తూ ఉంటాను. లేదూ... నన్నే మీ దగ్గరికి రమ్మనమన్నా వస్తాను. ఇంతకీ ఏ హొటల్లో దిగావు?"

"అంత డబ్బుతో నువ్వేం వస్తావు? పంపకాలున్నాయి కదా, ఎటూ మేమే నీ దగ్గరికి వస్తాం."

"మీరిచ్చినవి ఇచ్చినట్టే భద్రంగా ఉన్నాయి. ఎప్పుడొస్తారా అని మీ కోసం ఎదురుచూస్తూ ఉన్నాను. మీరు ఇన్ని సంవత్సరాలుగా ఏమయిపోయారు?"

వాసుకు నా మాట మీద గురి చెక్కుచెదిరినట్టు లేదు. సదానందానికీ నామీద ఏ అనుమానమూ ఉండకపోవచ్చు.

"వచ్చాక తీరుబడిగా అన్ని వివరాలూ చెబుతాను. ఉంటాను మరి.."

"సరే" అంటుండగానే, ఫోన్ పెట్టేశాడు. అది సెల్ నుంచి చేయలేదు. కాయిన్ బాక్స్ నుండి చేసినట్టుంది.

పంపకాల్లో నాకేమయినా భాగం ఉంటుందని నేను అనుకోవడం లేదు. ఆశించడం లేదు. అంత డబ్బు, నగలు ఎక్కడినుండి తెచ్చారో తెలుసుకోవడం నాకు అనవసర విషయం. ఆసక్తి కూడా లేదు. నేను కోరుకునేది ఒక్కటే. అందులోంచి నేను నొక్కేసిన సంగతి వాళ్ళకు తెలియకూడదు! అయినా ఇప్పుడు నాకు తక్కువేమీ లేదు. రెండు చేతులా సంపాయిస్తున్నాను.

పదిదాటక వస్తానన్న వాళ్ళు.. తొమ్మిదిన్నరకే సరాసరి ఏడో అంతస్తులోని

నా గదికి వచ్చారు. అది గది కాదు. పెంట్ హౌసంత ఉంటుంది. అక్కడున్న లాకరులోనే వాళ్ళ డబ్బు, నగలు ఉన్నాయి. అవి వాళ్ళకు ఇచ్చేస్తే నా బాధ్యత తీరిపోతుంది.

అదృష్టమేమిటంటే, ఇద్దరూ ఒకేసారి వచ్చారు. వాళ్ళు సోఫాల్లో కూర్చున్నాక, నేనూ కూర్చున్నాను. ఏసీ పనిచేస్తున్నా, నాకు ఉక్కగా ఉన్నట్టనిపిస్తోంది.

వాసులో పెద్ద మార్పు లేదు. కాకపోతే మనిషి కాస్త ఒళ్ళు చేసి గడ్డం పెంచాడు. సదానందం మునుపటిలానే ఉన్నాడు. చేతులకు ఖరీదయిన వాచీలు, వేళ్ళకు ఉంగరాలు, మెడలో బంగారపు గొలుసులు వాళ్ళ స్థాయి చెబుతున్నాయి. ఇంత సంపాదిస్తున్నా, వాళ్ళకు సరితూగనేమో!

"ఇంతకాలం కనిపించకుండా పోయారేం?" అడిగాను.

"ఎప్పటికప్పుడు వద్దామనుకుటూనే ఉన్నాం. ఆ అనుకోవడం అనుకోవడంగానే మిగిలిపోయింది" అన్నాడు వాసు.

"ఎక్కడ ఉంటున్నారు?"

"బళ్ళారిలో మైనింగ్ వ్యాపారంలో దిగాం. మట్టి ముట్టుకున్నా డబ్బయి పోతుంటుంది. అన్యాయం అనను కానీ, అన్నీ 'చట్టబద్ధం'గానే జరుగుతుంటాయి. ఏ నేల ఎవరిదో ఎవరికీ తెలియకుండా ఉంటుంది. పనులు ఎంత హఠాత్తుగా ఆగిపోతుంటాయో, అంత హడావుడిగానే మొదలవుతుంటాయి. ఇద్దరం బెంగుళూరులో స్థిరపడిపోయాం. మంచి ఇళ్ళే కట్టుకున్నాం. మా పెళ్ళిళ్ళు అయిపోయాయి. పిల్లలు చిన్నవాళ్ళు. బెంగుళూరులోనే చదువుకుంటున్నారు. ఒక దారిలో పడ్డాం..." వాసు చెప్పుకుంటూ వెళ్తున్నాడు.

వింటున్నానన్న మాటేగానీ, నా మనసు అటూ ఇటూ జరుగుతోంది. ఏమయినా అవుతుందో కాదో ఊహించలేకపోతున్నాను. ముఖంలో ఏ భావమూ కనిపించనీయడంలేదు. ఉండుండి సదానందం వంక చూసినప్పుడు, అతని చూపులు నా ముఖం మీదే తచ్చాడుతున్నాయి. మొదటినుండీ అతని చూపులు నా ఆత్మలోకి తొంగి చూస్తున్నట్టే ఉంటాయి!

వాసు చెబుతోంది నిజం అనిపించడం లేదు. ఏ విషయాన్నయినా అందమైన

అల్లికగా చెప్పగలడు. పదుగు పేకల్లో తేడా ఉండదు!

చాలాసేపు కబుర్లు చెప్పుకున్నాక "మీ డబ్బా సగలూ ఇచ్చేదా?" లేవబోయాను.

లేవద్దొన్నట్లు సదానందం చేయి ఊపాడు.

సోఫాలోంచి లేచే ప్రయత్నం విరమించుకుని కూర్చున్నాను. నడుం పక్క నుండి రివాల్వర్ తీసి సోఫాలో తన పక్కనే పెట్టి, "ఇక్కడికి ఎవరూ రారు కదా?" అడిగాడు.

నా గుండె వేగంగా కొట్టుకోవడం మొదలెట్టింది. "రారు" అన్నాను.

"మేమిచ్చిన దాంట్లోంచి ఏమయినా తీసుకోకపోయావా?" అడిగాడు వాసు.

"అపసరమనిపించలేదు. నాకేం తక్కువ? ఆస్పత్రులు కల్పవృక్షాలనుకో" అంటుంటే నా గుండె కొట్టుకునే చప్పుడు నాకే స్పష్టంగా వినిపిస్తోంది.

"డబ్బంటే ఎవరికి చేదు? చెప్పు. నీ డబ్బు మాకేమయినా ఇవ్వగలవా?" అడిగాడు సదానందం.

"ఎంత కావాలి?" అడిగాను.

జవాబు చెప్పలేదు. తల అడ్డంగా ఆడించాడు.

ఊపిరి తేలికగా వదిలాను.

"డ్రింక్స్ తీసుకుంటున్నావా, మానేశావా?" అడిగాడు వాసు.

"అప్పుడప్పుడు. మీ కోసం మూడు నాలుగు రకాలు తెప్పించాను" నా మనసు కుదుటపడుతోంది.

"నిన్ను ఇబ్బంది పెట్టడం ఎందుకని.. మేమే ఇక్కడికి తీసుకువచ్చాం" అన్నాడు సదానందం.

వాళ్ళకి నామీద అపనమ్మకం ఉందేమో! అన్యాయాలు చేయనని కాదు, పరిస్థితులు బట్టి చేస్తుంటాను. ఘోరాలు మటుకు చేయను, చేసేటంత ధైర్యస్థుడిని కాదు.

కాలేజి రోజుల నుండీ మందు మాకు కొత్తకాదు. అందులో నేను వాళ్ళంత స్థాయి కాదు. ఇప్పుడయితే ప్రభుత్వ అధికారులతో, అవసరం అనిపించే వ్యక్తులతో కూర్చోవడం తప్పనిసరి అయిపోయింది. ఎక్కడో కూర్చోవడం కన్నా మా పెంట్ హౌసులోనే కూర్చుంటుంటాం.

కార్యక్రమం మొదలయింది. కావలసిన సరంజామాతోనే వచ్చారు. మెల్లగా నేను గమనించిందేమిటంటే, వాళ్ళిద్దరి మధ్య సామరస్యం ఉన్నట్టనిపించలేదు! అవసర నిమిత్తం మాట్లాడుకుంటున్నట్టుంది. మాటలు కూడా పొడిగా ఉన్నాయి.

వాసు రాజకీయాల గురించి చెబుతున్నాడు. నేను, సదానందం వింటున్నాం. వింటున్న వాడల్లా సదానందం ఏదో అన్నాడు. గ్లాసులు నింపడంలో మునిగి ఉన్న నేను సదానందం అన్న మాట సరిగా వినలేదు. బూతుమాట మటుకు కాదనుకుంటాను. మాటామాటా పెరగలేదు.

చేస్తున్న పని ఆపి తలెత్తాను. వాసు చేతిలోని రివాల్వర్ సదానందం తలకు గురిపెట్టి ఉంది!

సదానందాన్ని కాల్చేస్తాడేమో అనిపించి భయపడుతూ లేచి నుంచుని, చేతులు అడ్డం పెట్టి "వద్దు వద్దు, నా ఆస్పత్రిలో గొడవలు జరిగితే, ఆగం అయి చాలా కోల్పోతాను" అన్నాను.

వాసు తూటా పేల్చలేదు. శబ్దం వినబడలేదు. రివాల్వర్‌లోంచి పొగ రాలేదు.

సదానందం రివాల్వర్ సోఫామీదే ఉంది. చేతిలోకి కూడా తీసుకోలేదు. ముందుకు ఒరిగి, సోఫాలోంచి కింద పడిపోయాడు.

వాసు వంక చూసి "సదానందాన్ని చంపేశావు" అన్నాను బాధతో.

"ఎక్కడ? నేను ట్రిగ్గర్ నొక్కందే..." అన్నాడు ముందుకు వంగి.

సదానందం ముఖంలోకి చూశాను. కళ్ళు తెరుచుకునే ఉన్నాయి. ముక్కులోంచి రక్తం చిక్కగా వస్తోంది. మెడపైన వేళ్ళపెట్టి తడిమాను.

ప్రమాదంలో కూరుకుపోతున్న నాకు భయంతప్ప మరేం తగలడం లేదు. వాసు చేతిలోని రివాల్వర్ చూడగానే, సదానందం భయపడిపోయి ఉండాలి. షాక్‌కు

గురయ్యాడు. పదిహేను నిమిషాల్లో మూడు నాలుగు ఇంజక్షన్లు ఇస్తే బతుకుతాడు.

జేబులోంచి సెల్ తీసి డాక్టర్ అన్నపూర్ణకు ఫోన్ చేశాను. ఆమె నాకు అసిస్టెంట్. చావుకు అతిదగ్గరయిన చాలామందికి ఆమె ప్రాణం పోసింది.

ఇప్పుడు నా కాళ్ళూ చేతులు ఆడటం లేదు. ఆమె అయితే సదానందాన్ని తప్పకుండా రక్షిస్తుంది. కానీ ప్రస్తుతం ఆమె సెల్ ఆపేసి ఉంది! ఆమె ఈమధ్యే కొన్న రెండో సెల్ నెంబర్ నాకు తెలియదు. మళ్ళీ చేశాను. తను ఇంటికి వెళ్తూ ఉండొచ్చు. డ్రైవింగ్ చేసేటప్పుడు సెల్ ఆపేస్తుంది.

ఆస్పత్రి రిసెప్షనిస్టుకు ఫోన్‌చేసి, "అన్నపూర్ణ డాక్టర్ ఎక్కడున్నా కనుక్కుని వెంటనే నాకు ఫోన్ చేయమని చెప్పు. చాలా అర్జంటు విషయం" అన్నాను.

"సరే సార్!" అంది రిసెప్షనిస్టు.

సెల్ టీపాయ్ మీదపెట్టి, సదానందం చేయి అందుకుని నాడి చూశాను. అందడం లేదు. మరో అయిదు నిమిషాలకు మనిషి జారిపోయాడు! అన్నపూర్ణ వచ్చినా ఇక చేయగలిగిందేమీ లేదు. రిసెప్షనిస్టుకు ఫోన్ చేశాను. ఎంగేజ్డ్!

తలపట్టుకుని సోఫాలో కూర్చున్నాను. వాసు వంక చూసి "సదానందం చనిపోయాడు" అని చిన్నగా అన్నాను. "మీ ఇద్దరికీ పడదా?" అని అడిగేశాను.

అతను వెంటనే జవాబు చెప్పలేదు. టీపాయ్ మీదున్న సిగరెట్ పెట్టెలోంచి సిగరెట్ తీసి పెదాల మధ్య పెట్టుకున్నాడు. అగ్గిపెట్టె అందుకుని అగ్గిపుల్ల తీశాడు. వెలిగించుకోలేదు. చేతివేళ్ళు వణుకుతున్నాయి. "అతని మీద నాకు కోపం లేదు. కానీ నేనంటేనే అతనికి ఎందుకో ఇష్టం లేదు. అతను రివాల్వర్ తీశాడు కాబట్టి నేనూ తీశాను..." అతని మాటలు స్పష్టంగా లేవు. ముద్దగా ఉన్నాయి.

"భయపెట్టడానికి తీశాడేమో?" అన్నాను.

"భయపెడితే, చంపేస్తే ఏం లాభం? డబ్బుల కోసం కదా ఇంతదూరం వచ్చింది? ఇన్ని సంవత్సరాలు దాచినందుకు కొంత నీకూ ఇద్దామనుకున్నాం. నిజం ఏమిటో తెలుసా? నా రివాల్వర్‌లో తూటాలు లేవు. హోటలు గదిలో ఉన్న నా సూట్‌కేసులో మర్చిపోయి వచ్చాను. నువ్వు నమ్మూ నమ్మకపో..." అంటుండగానే... అతని పెదాల మధ్య నుండి సిగరెట్ జారి కిందపడిపోయింది. అందుకోలేదు.

"ఇంతవరకూ నేనెవరినీ చంపలేదు. సదానందాన్నీ నేను చంపలేదు. చంపుతానేమో అని తనే భయపడి, చనిపోయి ఉండాలి..." అంటున్నాడు వాసు.

అతని మాటలకు అడ్డు తగిలి "అతను నిన్నేదో అన్నాడు. ఏమన్నాడు?" అడిగాను.

"నాకతనే డ్రింక్ ఇచ్చాడు. అందులో విషం కలిపాసన్నాడు..." అదే వాసు చివరిమాట. సోఫాలో ఒరిగిపోయాడు. నోట్లోంచి నురగలు వస్తున్నాయి.

నా చేష్టలుడిగిపోయాయి. చనిపోతున్న వాసును చూస్తూ అలా కూర్చుండిపోయాను!

నేను అనుకున్నది ఒకటి, జరిగింది మరొకటి. మామూలు మనిషిని కాపడానికి అరగంట పైగానే పట్టింది. నా తంటాలు నేను పడి ఏదయినా చేయాలి. చేస్తాను. కొద్దిగా ఇబ్బంది పడాలంతే.

లేచి లోపలి గదిలోకి వచ్చి లాకరు తలుపు తెరవబోయేంతలో, అదే తెరుచుకుంది! లాకరు లైటు వెలుగుతూ ఉంది.

ఆ నిలువెత్తు లాకరులో డబ్బు సంచులుగానీ, నగలపెట్టె గానీ లేవు! ఆపేసిన అన్నపూర్ణ సెల్‌మటుకు ఉంది!!

దానికిందున్న కాయితాన్ని అందుకున్నాను. అందులో "సారీ డార్లింగ్!" అని ఉంది!

***విపుల, డిసెంబర్ - 2012***